క్లుప్తంగా

ఆల్ ఇండియా టైక్వాండో పోటీలకు ముప్పాళ్ల విద్యార్థి


వై.రవీంద్రరెడ్డి

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన బీపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి వై. రవీంద్రరెడ్డి 87 ప్లస్ కేటగిరిలో ఎస్‌జేపీజేటీ యూనివర్శిటీ రాజస్థాన్‌లో నవంబరు 2వతేదీ నుంచి జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల ఆల్ ఇండియా టైక్వాండో పోటీల్లో పాల్గొంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు తెలిపారు. చీరాలలో ఈ నెల 27వ తేదీన జరిగిన అంతర్ కళాశాలలో టైక్వాండో పోటీల్లో ప్రతిభ కనపరిచి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు బలరాంనాయక్, సురేష్, దాసులు అభినందించారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



వినుకొండ(నూజెండ్ల): రోటరీ క్లబ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పటల్ వారిచే శనివారం పట్టణంలోని గోగినేని కల్యాణమండపం నందు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో షుగర్, హిమోగ్లోబిన్, కొలెస్ట్రాల్, మూత్రపిండాలు, లివర్, గుండె పరీక్షలకు సంబంధించి 600 మందికి పైగా వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 20 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ క్యాంప్‌కు సహకరించిన దాతలను, కాటూరు వైద్యబృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, డాక్టర్ సాంబశివరావు, క్లబ్ సభ్యులు సీహెచ్. కోటేశ్వరరావు, జి.గురునాథం, షేక్ రసూల్, ఆలా శ్రీనివాసరావు, బాజీ, శ్రీనివాసరావు, గిరిబాబు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని 26వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 26 వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి, టీడీపీ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు షేక్ కరీమ్‌సేట్, షేక్ సైదా, వారి మిత్రులు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులైన వారు పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించి తమ కుటుంబసభ్యుల్లా భావించి అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జాబితాను రైతులు సరిచూసుకోవాలి



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని అన్ని ఆర్‌బీకేలలో సామాజిక తనిఖీ కోసం ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని ఏవో షేక్ సుగుణాబేగం తెలిపారు. మండల కేంద్రమైన నూజెండ్లలోని ఆర్‌బీకే కేంద్రంలో ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ఆమె నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ముసాయిదా జాబితాలోని రైతుల వివరాలను ఆర్‌బీకే సిబ్బంది చదివి వినిపిస్తారన్నారు. రైతులు ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే సవరణ కోసం ఆర్‌బీకే కేంద్రాల్లోని వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్ఏలను సంప్రదించి అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలియ జేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ఇదే ఆఖరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు, చేర్పులు ఉండవని పేర్కొన్నారు. రైతులు కార్యక్రమంలో ఏఈవో ఎల్. ఎలీషా, వీఏఏ జి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వర్షంపై రైతుల హర్షం

నాదెండ్ల: వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతున్న తరుణంలో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షం రైతుల్లో ఆనందాన్ని నింపింది. ఈ ఏడాది సరైన వర్షాలు లేక పత్తి, మిర్చి రైతులతో పాటూ ఇతర పంటలు సాగుచేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కురిసిన వర్షం రైతుల్లో ఆనందం నింపింది. అయితే ఈ వర్షం అన్ని గ్రామాల్లో కురవకపోవటం విశేషం. గణపవరంతో పాటూ చిలకలూరిపేట, మరికొన్ని గ్రామాల్లో వర్షం కురిసింది. ప్రస్తుతం పత్తి, మిర్చి రైతులు వర్షం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

శావల్యాపురం విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి

- క్రీడల్లో సత్తాచాటుతున్న మండల బాలికలు
- వరుస విజయాలతో విజయ ఢంకా
- జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వేముల దివ్య


బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొనే బాలికల జట్టు


క్రీడా మైదానంలో ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారులు

శావల్యాపురం: విద్యతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ ప్రభుత్వ సౌజన్యంతో గత నాలుగు సంవత్సరాల నుంచి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో బాలికలు శావల్యాపురం హైస్కూలు విజయ ఢంకా మోగిస్తున్నారు. ఆడపిల్లలు అన్నీ రంగాల్లో ముందుంటు పురుషులకు దీటుగా తాము ఏం తక్కువ కాదని నిరూపిస్తున్నారు. జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ బాలికల విభాగంలో పోటీల్లో శావల్యాపురం హైస్కూలు విద్యార్థిని వేముల దివ్య (10వ తరగతి) సిల్వర్ మోడల్ సాధించి పలువురు మన్ననలు పొందింది. 6వ తరగతి నుంచి క్రీడల పట్ల ఆసక్తి చూపుతూ పలు స్కూల్‌గేమ్స్ నుంచి జాతీయ స్థాయి పోటీల్లో దివ్య ఉత్తమ ప్రతిభ చూపింది. పాఠశాల్లో బాలికల క్రీడా ప్రతిభను గుర్తించిన పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి వారికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి మెలకువలు నేర్పించి నైపుణ్యాన్ని పెంపొందించారు. మండలస్థాయి నుంచి జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటిన్ పోటీల్లో పాల్గొనే స్థాయికి నడిపించారు. విద్యార్థినులో ఉన్న నైపుణ్యాన్ని నలుదిక్కులు చూపటానికి తెలిసేలా దాతలు సహకారంతో ఇప్పటి వరకు 100 మంది బాలబాలికలను రాష్ట్రస్థాయి పోటీల్లో విజయ ఢంకామోగించి పతకాలు సాధించటానికి పీడీ రాధాకృష్ణమూర్తి తనదైనా శైలీలో చొరవ చూపారు. జాతీయస్థాయి బాల్‌బ్యాడ్యింటన్ క్రీడా పోటీల్లో వరుసగా రెండుసార్లు విజయం సాధించి క్రీడా కోటాలో ముక్కపాటి లిఖిత ఎస్ఆర్‌యం ఇంజినీరింగ్ కళాశాల ఉచితంగా సీటు సాధించి రెండవ సంవత్సరం ఇంజినీరింగ్ కోర్సు విద్యను అభ్యసిస్తోంది. గుంటకల వెన్నల స్కూల్ గేమ్స్ విభాగంలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపింది. ఆకుమళ్ళ సమీరా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆరుసార్లు విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో నాలుగుసార్లు పాల్గొనగా ఓర్సు స్రవంతి, కామినేడి కావ్య ఆరుసార్లు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంది. క్రీడాల్లో మక్కువతో శావల్యాపురంలో జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదట సంవత్సరం చదువుతోంది.

బాలికల్లో ప్రతిభను వెలికితీస్తాం



గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్యతో క్రీడాల్లో రాణించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా. ఇందుకుగాను బాల్‌బ్యాడ్యింటన్ క్రీడా పోటీలకు అవసరమైన తర్ఫీదు ఇస్తున్నాం. రానున్న రోజుల్లో క్రీడల పట్ల మరింత ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని నింపేలా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాం.

–రాగుల రాధాకృష్ణమూర్తి, పీడీ, శావల్యాపురం

చాలా సంతోషంగా ఉంది



జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనటం చాలా సంతోషంగా ఉంది. ఈస్థాయి వరకు రావటం నాజీవితంలో మరుపురాని రోజు. భవిష్యత్‌లో క్రీడాల్లో మంచి ప్రతిభను చూపి పేదరికాన్ని అధిగమించి తన తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తెస్తా.

– వేముల దివ్య, 10వ తరగతి, శావల్యాపురం

రెండుసార్లు విజయం సాధించా



జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో రెండుసార్లు విజయం సాధించటం చాలా సంతోషంగా ఉంది. నేను 9వ తరగతి నుంచి బాల్‌బ్యాడ్యింటన్ క్రీడలో ప్రావీణ్యం సాధించా. మా వ్యాయామ ఉపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి సహాయ సహకారాలతో నేను ఈ స్థాయికి వచ్చా. క్రీడా కోటాలో థర్డ్ ఇయర్ చదువుతున్నా. గ్రూప్స్‌లో మంచి ఫలితాలు సాధించటానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

– ముక్కపాటి లిఖిత, ఇంజినీరింగ్ విద్యార్థి

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- కట్టకింద బజారులో గడపగడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హత ఉండి ఇంకా సంక్షేమ ఫలాలు పొందని వారిని గుర్తించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. పట్టణంలోని 26 వార్డులోని కట్టకింద బజారులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నవరత్నాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. వినుకొండ పట్టణాన్ని తమదైన శైలిలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పట్టణ తాగునీటి సమస్యను పరిష్కారం చేశామని, రానున్న రోజుల్లో రెండుపూటల తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే గత పదేళ్లల్లో వినుకొండ ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉందనే విషయాన్ని ప్రజలే గుర్తించాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ఎన్ఎస్‌పీ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, రైతు బజారు, ప్రభుత్వ బాలికలకు అదనపు తరగతి గదులు, పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలువ అభివృద్ధి, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ముస్లింలకు పాఠశాల, కళాశాల, వినుకొండ ఘాట్‌రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డు, మున్సిపల్ స్టేడియం, రైల్వే అండర్ బ్రిడ్జితో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇల్లు లేని నిరుపేదల కోసం 5400 ఇళ్లను జగనన్న కాలనీలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హత ఉండి అందలేని వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించడమే గడపగడప యొక్క ముఖ్యఉద్దేశమన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కోర్టుల్లో కేసులు వేసి ఆపడం తప్ప మాజీ ఎమ్మెల్యే జీవీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. పదేళ్ల శాసనసభ్యుడిగా ఉన్న నీవు ప్రజల తాగునీటి సమస్యను ఎందుకు తీర్చలేకపోయావన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆమడ దూరంగా నిలిచి కమిషన్ల కోసం అభివృద్ధి పనులు వాయిదా వేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. నీ స్థాయి మరచిపోయి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రిని, ఒక పార్లమెంటు సభ్యుడని కూడా చూడకుండా నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. స్కిల్ డెవలప్‌మెంట్ అంటూ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వ ధనాన్ని లూటీ చేశాడు కాబట్టే ఈ రోజు మీ నాయకుడు జైల్లో ఉన్నాడని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వినుకొండ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని, ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండకు రాష్ట్రంలోనే పేరుప్రతిష్ఠలు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్, వినుకొండ మండల అధ్యక్షుడు దండు చెన్నయ్య, వార్డు కౌన్సిలర్ కాంట్రాక్ట్ గంటా కాలేషా, వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, ఎంఎస్‌కే బాషా, మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలి

ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ బాలనాగమ్మ

రొంపిచర్ల: మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందజేయాలని ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎండీఓ కె.మ్యాథ్యూబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేసి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రామ వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేయాలన్నారు. ఎండీఓ కె. మ్యాథ్యూబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకం క్రింద గ్రామాలలో సురక్ష వైద్యశిబిరములు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.అంకారావు, ఆర్ఐ కె. సుబ్బారావు, పంచాయతీ రాజ్ ఏఈ జగన్మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్ర గ్రహణమని...


గణపవరంలో మూసివేసిన రామాలయం


శావల్యాపురంలో మూసివేసిన దుర్గమ్మ దేవాలయం

నాదెండ్ల: పాక్షిక చంద్రగ్రహణం నేపథ్యంలో మండలంలోని ఆలయాలు శనివారం మూతపడ్డాయి. ఉదయం ఆలయాలను తలుపులు తీసి ప్రత్యేక పూజలు, స్వామివారికి మహా నివేదన అనంతరం 11 గంటల నుంచి ఆదివారం 10 గంటల వరకూ మూసివేయనున్నారు. గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయం, చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయ పూజారి దర్శి అనిల్‌కుమార్ మహా నివేదన అనంతరం మూసివేశారు. ఈ గ్రహణం వలన అశ్విని, భరణి, కృత్తిక నక్షత్రాల్లో జన్మించిన వారు గ్రహణ శాంతి పూజ నిర్వహించుకోవాలని పూజారులు తెలిపారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: చంద్రగ్రహణం కారణంగా మండలంలోని దేవాలయాలన్నీ సాయంత్రం 6 గంటలకు మూసివేశారు. శనివారం అర్ధరాత్రి 1.05 నుంచి 2.22 నిమిషాల వరకు పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ముందస్తుగా దేవాలయాలన్నీ మూత వేశారు. శావల్యాపురంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ దేవాలయానికి సాయంత్రం పూజారి రావిపాటి సాయిభరత్ శర్మ తాళాలు వేశారు. ఆదివారం శుద్ధి, ప్రత్యేక పూజలు అనంతరం దేవాలయంలో పూజలు పునః ప్రారంభమవుతాయన్నారు.

ఓటరు జాబితా తనిఖీ చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ జి.సుజాత

చిలకలూరిపేటటౌన్: ఓటరు నమోదులో మార్పు లు, చేర్పులు, తొలగింపులు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చిలకలూరిపేట మండల తహసీల్దార్ జి.సుజాత చెప్పారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. 27వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ జరిగిందని, ఇందుకు సంబంధించి బూత్‌స్థాయి అధికారులు ఓటర్ జాబితాను తనిఖీ చేయాలని సూచించారు. ఏమైనా ఇంటి నంబర్ సున్నా ఉంటే వాటిని గుర్తించి సవరించటానికి ఫాం-8 దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఒకే ఇంటి నంబర్‌తో 10 అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉంటే ఫాం-8లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలగింపులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులు డిసెంబర్ 26 తేదీ లోపు విచారణ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జనవరి 5, 2024 న ఓటర్ల తుది జాబితా ప్రచురించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

లీగల్‌మెట్రాలజీ అధికారుల దాడులు

- ఆరుగురిపై కేసులు నమోదు
- అపరాధ రుసుం వసూలు


నాదెండ్ల ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న, షాలేమ్‌రాజు, శివశంకర్

నాదెండ్ల: మండలంలోని పలు వ్యాపార దుకాణాల్లో లీగల్‌మెట్రాలజీ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండలంలోని నాదెండ్ల, గణపవరంతో పాటూ మరికొన్ని గ్రామాల్లోని పురుగుమందులు, ఎరువుల దుకాణాలు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తించి ముగ్గురు దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. ఒక కిరాణా దుకాణంలో కాటాలో వ్యత్యాసాలున్నట్లు గుర్తించారు. మరో ఎలక్ట్రికల్ దుకాణంలో వస్తువులపై డిక్లరేషన్ లేదని కేసు నమోదు చేశారు. గుంటూరు డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ అధికారి టి షాలేమ్‌రాజు, నరసరావుపేట లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తనిఖీల్లో పాల్గొన్నారు. కేసులు నమోదుతో పాటూ అపరాధ రుసుము వసూలు చేశారు. సాధారణ కాటా ఉన్న వారు ప్రతి ఏడాది కాటాలను రెన్యువల్ చేయించుకోవాలని, ఎలక్ట్రానిక్ కాటాలున్న యజమానులు రెండేళ్ళకోసారి రెన్యువల్ చేయించుకోవాలన్నారు. నిత్యావసరాలు, ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


యల్లమందలో వైద్య శిబిరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


గండిగనుమలలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు


గండిగనుమలలో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నరసరావుపేట రూరల్: పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని యల్లమంద-2 సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వైద్య శిబిరంలో అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, వైద్యశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని వివరించారు. వైద్య శాఖలోని ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయడంతో పాటు ఆసుపత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అందజేస్తారని తెలిపారు. రోగికి మెరుగైన వైద్యం అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తారని వివరించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 531 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 268 మంది మహిళలు, 263 మంది పురుషులు ఉన్నారు. కంటి సంబంధమైన సమస్యలతో బాధపడుతున్న 89 మందికి కంటి పరీక్షలను సిబ్బంది నిర్వహించారు. కోటప్పకొండ, పమిడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ నందకుమార్, డాక్టర్ జోయల్ ప్రసాద్‌లు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, చల్లా సుబ్బారావు, కొరెంటు నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

బరంపేటలో 192 మందికి వైద్యసేవలు

నరసరావుపేట: పట్టణంలోని బరంపేట మున్సిపల్ పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) వైద్యశిబిరంలో 192 మందికి వైద్యసేవలు అందజేశారు. ప్రాథమిక వైద్యశాల డాక్టర్ జి.హర్షవర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ స్పందన, జనరల్ సర్జన్ డాక్టర్ ఖాజా, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ప్రియాంక, త్రివేణి వైద్యసేవలు అందజేశారు. అంగన్వాడి కార్యకర్తలు పౌష్టికాహారంతో తయారుచేసిన వంటకాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వైద్యం చేయించుకున్న వారందరికీ ఉచితంగా రక్తపరీక్షలు చేసి మందులు అందజేశారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

బొల్లాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుందని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. మండలంలోని గండిగనుమల సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ ఆర్.బీమిబాయి కృష్ణానాయక్, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ డి. గోవిందునాయక్‌లు ప్రారంభం అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందని, పట్టణ ప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలు పొందాలంటే ఖర్చుతో కూడుకోవడంతో ప్రత్యేక వైద్య నిపుణులు గ్రామాల్లోకి వచ్చి సురక్ష ద్వారా వైద్య సేవలు అందించడం పేదల ప్రజలకు ఆరోగ్యం అందుబాటులోకి వచ్చిందని అన్నారు. ఈ పథకం ద్వారా ముందస్తుగా వైద్య సిబ్బంది, వలంటీర్లు గ్రామాల్లో తిరిగి రోగ సమాచారం సేకరించడంతో పాటు సచివాలయాల పరిధిలో వైద్య శిబిరం నిర్వహించడంతో విశేష ఆదరణ లభించిందన్నారు. ఈ వైద్య శిబిరంలో బొల్లాపల్లి, వెల్లటూరు వైద్యాధికారులు జి.వీరనరేష్, ఎం.సాయివినూత్నలు, ప్రత్యేక వైద్య నిపుణులు బి.రాంబాబు, జి. శ్రీనివాసరెడ్డి, కంటి వైద్యులు షేక్ జానీహీరాలు వైద్య చికిత్సలు చేసి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 622 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 102 మందికి కంటి వైద్యంతో పాటు వీరిలో మరో ఐదుగురిని ఆరోగ్య శ్రీ ద్వారా వివిధ కార్పొరేట్ హాస్పిటళ్ళకు ప్రత్యేక చికిత్సకు రిఫర్ చేసినట్లు వైద్యాధికారి జి. వీరనరేష్ తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్య శిబిరంలో పోషకాహార వంటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య, సర్పంచ్ టి. బిక్షాలు, వి.దుర్గాశ్రీను నాయక్, ఎంపీటీసీ ఎస్. మంగాబాయి బాలునాయక్, జి.శ్రీహరి, వైద్య, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్స్ రక్తదానం

యడ్లపాడు: పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా యడ్లపాడు పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఐదుగురు రక్తదానం చేశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో పోలీసులశాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌కు చెందిన సిబ్బంది మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, కిషోర్, నరేష్, ప్రవీణ్ పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ పి సురేష్‌కుమార్ వారిని అభినందించారు.

ఇరువురికి ఏడాది జైలు శిక్ష

చిలకలూరిపేటటౌన్: వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటనకు సంబంధించి ఇరువురు వ్యక్తులకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కె.నరేంద్రరెడ్డి శుక్రవారం తీర్పు నిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పాటిమీదకు చెందిన అందుగుల శ్రీకాంత్‌ను పట్టణంలోని వడ్డెర పాలెంకు చెందిన దార్ల శ్రీకాంత్, కోడిరెక్క శేషయ్యలు గత సంవత్సరం డిసెంబర్ నెలలో సెల్‌ఫోన్ వివాదం కారణంగా దాడి చేశారు.ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నేరం రుజువు కావడంతో ఇరువురికి న్యాయమూర్తి శిక్ష విధించారు.

వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట: సోరియాసిస్‌డే సందర్భంగా గుంటూరురోడ్డులోని కేరళ ఆయుర్వేద హాస్పిటల్‌లో ఆదివారం నుంచి మూడురోజులపాటు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి శనివారం కోరారు. ప్రతి విషయాన్ని డాక్టర్‌తో సంప్రదించి చర్చించి తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

గణపవరంలో దోమల నివారణకు చర్యలు

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో గత కొద్దిరోజులుగా దోమల బెడత కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. దోమల నివారణకు గ్రామంలో మలాథియన్ పిచికారీ నిర్వహిస్తున్నారు. గ్రామంలోని వీధులను బ్లీచింగ్‌తో శుభ్రం చేసి కాలువల్లో ఫాగింగ్ చేశారు. పారిశుధ్యాన్ని మెరుగ్గా నిర్వహించి దోమల ఉధృతి తగ్గించేందుకు పనులు చేపట్టామని, మరికొన్నిరోజుల పాటూ పనులు కొనసాగుతాయని పంచాయతీ కార్యదర్శి ఆరవపల్లి శేఖర్ తెలిపారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: కావలి ఆర్టీసీ బస్సు డ్రైవరు రామసింగ్, కండక్టర్‌లపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ బొందిలి సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 26వ తేదీన కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వారిపై దాడి చెయ్యడం జరిగిందన్నారు. ఇది చాలా విచారించ దగ్గ విషయమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకి ఎంతగానో ప్రాదాన్యత ఇస్తున్నారని, తక్షణమే నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఘనంగా పాఛవలిబాబా దర్గా ఉరుసు

యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామం కొండవీడు కొండపైన మెట్ల మార్గంలో వేంచేసి హజరత్ సయ్యద్ పీర్ పాఛవలి బాబా ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్గాను చేరుకుని బాబావారిని దర్శించుకున్నారు. ముజావర్లు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. రాత్రి 8 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాబావారి గంధమహోత్సవం ప్రత్యేక అలంకరణలో ఉన్న అశ్వంపై ఊరేగింపు బయలుదేరింది. కోట, కొండవీడు గ్రామాల్లో పర్యటించి శనివారం తెల్లవారు జామున దర్గాకు చేరుకుంది. ముజావర్లు, కమిటీ సభ్యులు బాబావారికి దీపారాధన (ఫాతెహా) చేసి గంధం, ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలను కమిటీ సభ్యులు మద్దినగర్ షేక్ బాజీ, షేక్ ఖాజ(బాజీషహీద్ బ్యాటరీవర్క్స్), అలాం అమానుల్లా, అబ్దుల్ దావత్, అబ్బుతాలిక్, బాష కార్యక్రమ వివరాలను తెలిపారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: నాదెండ్ల సమగ్ర శిశుఅభివృద్ధి పథకంలో (ఐసీడీఎస్) ఖాళీగా ఉన్న 18 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీవో శాంత కుమారి చెప్పారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను తమ కార్యాలయంలో అందించాలన్నారు. కనీసం 7వ తరగతి పాసై ఉండాలని, ది.01.07.2023వ తేదీ నాటికి 21-35 ఏళ్ళ మధ్య వయస్సు కలిగి ఉండి వివాహితురాలై స్థానికంగా ఉండాలన్నారు. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు కనీస వయస్సు 18 ఏళ్ల నిండిన వారిని పరిగణలోకి తీసుకుంటామన్నారు.